
సాక్షి ఒడిశా

బుధవారం । 24 । జనవరి । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ.4,43,473
బంగారం 20 మిల్లీ గ్రాములు
వెండి 23 గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



ఆదర్శనీయుడు నేతాజీ

నేటి యువత నేతాజీ సుభాష్ చంద్రబోస్‌ను ఆదర్శంగా తీసుకోవాలని వక్తలు సూచించారు.

-10లో



విద్యతోనే ఉన్నత శిఖరాలు

క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని 5టీ కార్యదర్శి వి.కె.పాండియన్ అన్నారు.

-10లో

న్యూస్‌రీల్

మట్టి పెళ్లలు పడి యువకుడి మృతి



మట్టి పెళ్లలు కింద గౌరొడియా మృతదేహం

రాయగడ: పైప్‌లైన్ పనుల్లో భాగంగా పనులు చేస్తున్న ఒక యువకుడిపై మట్టి పెళ్లలు పడిన ఘటనలో యువకుడు మృతి చెందిన ఘటన జిల్లాలోని తెరువలి పంచాయతీ పరిధి గోపికంకపాడు గ్రామంలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. మృతుడు మునిగుడ సమితి అంబొదల గ్రామానికి చెందిన ధొబా గౌరొడియా (27)గా గుర్తించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని జిల్లా కేంద్రాస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. గోపికంకపాడు గ్రామంలో కొద్దిరోజులుగా వసుధ పథకంలో భాగంగా పైపులైన్‌లు వేస్తున్నారు. ఈ క్రమంలో పనులు చేసేందుకు గౌరొడియా వెళ్లాడు. జేసీబీతో మట్టి తవ్వుతుండగా దానిని సరిచేసే పనిలో ఉండగా ఒక్కసారిగా మట్టిపెళ్లలు అతినిపై పడి ఊపిరాడక అక్కడిక్కడే మృతి చెందాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య



శ్యామ్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి రసియాగూడ గ్రామానికి చెందిన శ్యామ్ ఖీలో (42) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడు. శ్యామ్ రోజుకూలీగా పొలం పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం ఎప్పటిలాగే ఇంటి నుంచి బయటకు వెళ్లిన శ్యామ్ రాత్రి 9 గంటల సమయానికి ఇంటికి వచ్చాడు. అయితే అప్పటికే అతని ఆరోగ్యం క్షీణించింది. అది గమనించిన భార్య అతడిని చిత్రకొండ ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లింది. అతడిని పరీక్షించిన వైద్యులు శ్యామ్ విషం తాగినట్లు నిర్ధారించారు. అనంతరం చికిత్స పొందుతూ అర్ధరాత్రి 2 గంటల సమయంలో మృతి చెందాడు. వ్యవసాయంలో నష్టం రావడంతోనే ఆత్మహత్య చేసుకొని ఉంటాడని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహం అప్పగించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా తరలిస్తున్న తాబేళ్లు పట్టివేత

- నలుగురు అరెస్టు



బస్తాల నుంచి తాబేళ్లను బయటకు తీస్తున్న దృశ్యం

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి మోటు చెక్‌పోస్టు వద్ద సోమవారం రాత్రి పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించారు. ఆ సమయంలో ఒక వాహనాన్ని తనిఖీ చేయగా, అక్రమంగా తరలిస్తున్న 500 తాబేళ్లు బయటపడ్డాయి. దీంతో వాటిని తరలిస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. వీటిని ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణ జిల్లా నుంచి మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి ఎంవీ 83 గ్రామానికి తరలిస్తున్నట్లు నిందితులైన శక్తిదేవ్ గైన్, జె.నాగరాజ్, జె.వంశీ, జి.నాగేంద్రలు తెలియజేశారు. తాబేళ్లను మోటు ఫారెస్టు రేంజర్ మురళీధర్ అనుగూలియ్యాకు పోలీసులు అప్పగించారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో మంగళవారం హాజరు పరిచారు.



అభివృద్ధికి నోచుకోని కన్నుగుడ గ్రామం



నిరుపయోగంగా ఉన్న ఆరోగ్య కేంద్రం

గ్రామానికి గ్రహణం

శిథిలం అనే పదం ఆ గ్రామ చిరునామ. బూతద్దం పెట్టి చూసినా ఇసుమంతైనా అభివృద్ధి కనిపించదు. కాలి నడకన వెళ్దామన్నా రహదారి సౌకర్యం లేదు. గొంతెండితే దాహం తీర్చేందుకు బావులు ఉండవు. అనారోగ్యమొస్తే నదిని దాటి వెళ్తేగానీ వైద్యమందని దుస్థితి. బడులున్నా ఉపాధ్యాయులు అందుబాటులో లేని వైనం. నిరుపయోగమైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం. నిస్తేజమైన జీవితం. ఇదే కన్నుగుడ గ్రామ పరిస్థితి...

- అభివృద్ధికి ఆమడ దూరంలో కన్నుగుడ
- ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోని పాలకులు
- మూకుమ్మడిగా ఆత్మహత్యలు చేసుకుంటామని గ్రామస్తుల హెచ్చరిక



శిథిలావస్థలో ప్రాథమిక పాఠశాల భవనం

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి గోరఖ్‌పూర్ పంచాయతీ పరిధి కన్నుగుడ గ్రామంలో సమస్యలు విలయతాండవం చేస్తున్నాయి. గత రెండేళ్లుగా తమ గ్రామానికి మౌలిక సౌకర్యాలు కల్పించాలని గ్రామస్తులు జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకొస్తున్నా, అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ఈనెల 24వ తేదీ నుంచి సమితి కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టేందుకు సిద్ధమయ్యారు. అప్పటికీ తమ గ్రామ సమస్యలు పరిష్కరించకుంటే, తామంతా సామాహికంగా ఆత్మహత్యలు చేసుకుంటామని తెలియజేశారు. ఈ మేరకు రాష్ట్రపతి పేరిట ఒక వినతిపత్రంను సమితి అధికారులకు సమర్పించేందుకు సన్నద్ధమయ్యారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి ఏడు పదులు దాటినా తమ గ్రామాన్ని ఎవ్వరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

నిరుపయోగంగా కట్టడాలు

గ్రామ ప్రజల కోసం ఐదేళ్ల క్రితం నిర్మించిన ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడీ భవనాలు నిరుపయోగంగా పడి ఉన్నాయి. గ్రామానికి సరైన రహదారి లేకపోవడంతో అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు గ్రామానికి రావడం లేదు. గ్రామానికి చేరుకోవాలంటే మధ్యలో నదిని దాటాల్సి ఉండడంతో వచ్చేందుకు విముఖత చూపుతున్నారు. గ్రామంలోని ఆరోగ్య కేంద్రం సైతం నిరుపయోగంగా పడి ఉంది. దీంతో అత్యవసర చికిత్స కోసం తాము కాసీపూర్ వెళ్లేందుకు నానా అవస్థలు పడుతున్నామని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

శిథిలమైన పాఠశాల భవనం

గ్రామంలో సుమారు 30 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. వీరందరి కోసం ఉన్న ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. పాఠాలు చెప్పేందుకు ప్రభుత్వం ఇద్దరు ఉపాధ్యాయులను నియమించింది. కానీ రహదారి లేని కారణంతో వారు కనీసం వారానికి ఒకసారి కూడా పాఠశాలకు వచ్చి పిల్లలకు పాఠాలు చెప్పే దాఖలాలు కనిపించడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కాగా వీరిలో ఒక ఉపాధ్యాయిని నెల రోజుల క్రితం డిప్యుటేషన్‌పై వేరే పాఠశాలకు వెళ్లడంతో పరిస్థితి మరింతి దుర్భరమయ్యింది. చదువులు సాగక పిల్లలు తల్లిదండ్రులతో కలిసి పొలం పనులకు వెళ్లాల్సిన దుస్థితి దాపురించింది. దీంతో ఈనెల 24వ తేదీ నుంచి గ్రామస్తులంతా కలిసి 24 కిలోమీటర్ల దూరంలో ఉన్నటువంటి కాసీపూర్‌లోని సమితి కార్యాలయానికి పాదయాత్ర నిర్వహించి, అనంతరం అక్కడ ఆందోళన చేపట్టనున్నారు.

గ్రామంలో 50 కుటుంబాలు

కొండ ప్రాంతంలోని కన్నుగుడ గ్రామంలో 50 కుటుంబాలకు చెందిన దాదాపు రెండు వందల మందికిపైగా జనాభా నివసిస్తున్నారు. వీరందరి తాగునీటి సౌకర్యార్థం కేవలం ఒకే గొట్టపు బావి ఉంది. అది కూడా సకాలంలో పనిచేయడం లేదు. గంటల కొద్ది గొట్టపు బావిని కొడితే రెండు బిందెలు నిండుతున్నాయి. అవి కూడా బురద నీరు కావడంతో తాగేందుకు పనికిరావడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. దీంతో సమీపంలోని నది నీటిని తాగేందుకు ఉపయోగించి రోగాలబారిన పడుతున్నారు.



గ్రామానికి వెళ్లే రహదారి



నిరుపయోగంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రం



చదువులు లేక ఖాళీగా ఉన్న విద్యార్థులు



సమస్యలు పరిష్కరించాలని విన్నవిస్తున్న గ్రామస్తులు

పెద్ద మనసు చాటుకున్న ఆనందరావు

- సామాజిక భవన నిర్మాణానికి స్థలం వితరణ



పసుమర్తి ఆనందరావు దంపతులు

కొరాపుట్: అడుగు భూమి పక్కవాడిది ఉంటేనే సొంతం చేసుకునే ప్రస్తుత రోజుల్లో దాదాపు రూ.50 లక్షలు విలువ చేసే భూమిని వితరణ చేసి ఒక వ్యక్తి పెద్ద మనసు చాటుకున్నారు. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో ఆర్య వైశ్య సంఘం సామాజిక భవనం నిర్మాణం కోసం వ్యాపారవేత్త పసుమర్తి ఆనందరావు భారీ వితరణ చేశారు. జిల్లా కేంద్రంలోని బట్టసాలిగుడలో ఉన్న 10 సెంట్ల భూమిని విరాళంగా ఇచ్చారు. ఈ స్థలంలో సామాజిక భవనం నిర్మించి కార్యక్రమాలకు వినియోగించాలని సూచించారు. దానానికి అనుగుణంగా ఆ భూమిపై సర్వహక్కులు ఆర్య వైశ్య సంఘానికి చెందుతున్నట్లు రిజిస్ట్రేషన్ చేయించారు. అంతేకాక భవన నిర్మాణం కోసం తన వంతు సాయంగా రూ.1 లక్ష అందజేశారు. అలాగే కరోనా సమయంలోనూ ఆయన ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.1 లక్ష అందజేశారు. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న సంఘం అధ్యక్షుడు వడ్డాది శ్రీనివాసరావు తన వంతు విరాళంగా భవన నిర్మాణానికి రూ.5 లక్షలు ఇచ్చారు.

ప్రభుత్వం నుంచి రూ.10 లక్షలు మంజూరు

కొంతకాలంగా ఆర్య వైశ్య సంఘం సామాజిక భవనం నిర్మాణం కోసం ప్రయత్నాలు చేసింది. స్థలం ఇవ్వడానికి ఆనందరావు ముందుకు రాగా నిధుల సమస్య ప్రశ్నార్థకంగా మారింది. దీంతో ఒడిశా తెలుగు కమ్యూనిటీతో ఆర్య వైశ్య సంఘం చర్చలు జరిపింది. అనంతరం కమ్యూనిటీ సమన్వయంతో ఒక ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. అందులో అతిథిగా పాల్గొన్న కొరాపుట్ సెంట్రల్ కో-ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వర్ చంద్ర పాణిగ్రాహి నిధుల విషయం 5టీ చైర్మన్ కార్తికేయ పాండ్యన్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ రూ.10 లక్షలు మంజూరు చేసినటుల్ ప్రకటించారు. అలాగే అదే సమావేశంలో పాల్గొన్న నబరంగ్‌పూర్ పార్లమెంట్ సభ్యుడు రమేష్ చంద్ర మజ్జి మరో రూ.5 లక్షలు తన కోటా నిధులు మంజూరు చేశారు. నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే సదాశివ ప్రదాని కూడా తన వంతు రూ.5 లక్షలు ఇస్తానని ప్రకటించారు. ఆనందరావు స్థలం అందజేయడంపై ఆర్య వైశ్య సంఘం ఒడిశా రాష్ట్ర అధ్యక్షుడు రవ్వా రామకృష్ణ, ఎంపీ రమేష్ చంద్ర మజ్జి, ఎమ్మెల్యే సదాశివ ప్రధాని, కేసీసీ బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వర్ పాణిగ్రాహీలు అభినందనలు తెలిపారు.

నిజాయితీ చాటుకున్న మహిళ



గీతాంజలి దాస్

జయపురం: పది రూపాయల కోసం హత్యలు చేస్తున్న ప్రస్తుత సమాజంలో, ఒక మహిళ తన బ్యాంక్ ఖాతాలో పొరపాటున జమ అయిన రూ.4 లక్షల విషయం అధికారులకు తెలియజేసి నిజాయితీ చాటుకుంది. వివరాల్లోకి వెళ్తే.. స్థానిక లింగరాజ్ నగర్‌లో నివసిస్తున్న ఆటో డ్రైవర్ మీనకేతన దాస్ భార్య గీతాంజలి దాస్‌కు జయపురం యూకో బ్యాంక్‌లో అకౌంట్ ఉంది. ఆమె అకౌంట్‌లో సోమవారం పొరపాటును రూ.4 లక్షలు జమ అవ్వడం చూసి భార్యభర్తలిద్దరూ ఆశ్చర్యపోయారు. వెంటనే గీతాంజలి యూకో బ్యాంక్‌కు వెళ్లి తన ఖాతాలో పొరపాటున జమ అయిన డబ్బుల విషయం అధికారులకు తెలియజేసింది. దీంతో బ్యాంక్ సిబ్బంది పరిశీలించగా అ డబ్బు ఒక మిల్లు యజమాని కె.బి.రావు అకౌంట్‌లో జమ కావాల్సినవిగా గుర్తించి ఆమెకు తెలియజేశారు. వెంటనే రావును పిలిపించి ఆమె సమక్షంలో డబ్బులు ఆయన ఖాతాకు ట్రాన్స్‌ఫర్ చేశారు. డబ్బు ట్రాన్స్‌ఫర్ అవ్వడానికి బ్యాంక్ ఖర్చును కూడా ఆమె చెల్లించారు. దీంతో ఆమె నిజాయితీని అందరూ ప్రశంసించారు.

నలుగురు నిందితులు అరెస్టు



అరెస్టైన నిందితులను చూపిస్తున్న పోలీసులు



సీజ్ చేసిన నగదు, ఆభరణాలు



బాధితుడికి నగదు అప్పగిస్తున్న పోలీసులు

బరంపురం: కొద్ది రోజుల క్రితం నగర శివారు మండియాపల్లి గ్రామంలో జరిగిన దోపిడీ కేసుకు సంబంధించి నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. గోపాల్‌పూర్ పోలీసుస్టేషన్ పరిధి మండియాపల్లి గ్రామంలో నివసించే సంతోష్ కుమార్ పట్నాయక్ ఇంటిలో కొద్ది రోజుల క్రితం దోపిడీ జరిగింది. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం నలుగురు నిందితులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.1.58 లక్షల నగదు, 189.44 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైనవారిలో శిబ పరిడా, ఎస్.ప్రమోద్ ప్రధాన్, సుదర్శన్ సాహు, అభిమన్య సాహులు ఉన్నట్లు వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న సొత్తును ఎస్పీ సార్వణ్ వివేక్ సమక్షంలో బాధితుడు సంతోష్ కుమార్ పట్నాయక్‌కు అప్పగించారు. అరెస్టైనవారిని కోర్టులో మంగళవారం హాజరుపరిచారు.



సీజ్ చేసిన మద్యం బాటిళ్లు

నకిలీ మద్యం సీజ్

బరంపురం: రాష్ట్ర రాజధాని భువనేశ్వర్ నుంచి గంజాం జిల్లా బంజనగర్‌కి ఆటోలో అక్రమంగా తరలిస్తున్న నకిలీ మద్యంను ఎక్సైజ్ అధికారులు సీజ్ చేశారు. ఐఐసీ అధికారి ఉదయ్‌కుమార్ సంతోష్ తెలిపిన వివరాల మేరకు.. బరంపురం నగరానికి అటోలో నకిలీ మద్యం రవాణా చేస్తున్నట్లు బరంపురం ఎక్సైజ్ అధికారులకు మందస్తు సమాచారం వచ్చింది. దీంతో గోపాల్‌పూర్ జంక్షన్ మార్గ మధ్యలో వాహన తనికీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానంతో ఒక ఆటోలో తనికీలు నిర్వహించగా భారీగా నకిలీ మద్యం పట్టుబడింది. దీంతో ఆటో డ్రైవర్‌ను అరెస్టు చేసి, మద్యం సీజ్ చేశారు.

సస్పెన్షన్ ఉపసంహరణ

- మరలా కాంగ్రెస్‌లోకి ఎమ్మెల్యే మహ్మద్ మొకీం..?



అజోయ్ కుమార్‌ను కలిసిన మహ్మద్ మొకీం, చిరంజీబ్ బిశ్వాల్

భువనేశ్వర్: బరాబటి-కటక్ నియోజకవర్గం ఎమ్మెల్యే మహ్మద్ మొకీం, కాంగ్రెస్ శాసనసభ మాజీ ఉప నాయకుడు చిరంజీబ్ బిస్వాల్‌పై సస్పెన్షన్ ఉత్తర్వులను కాంగ్రెస్ పార్టీ మంగళవారం ఉపసంహరించుకుంది. అలాగే మాజీ ఎమ్మెల్యే కృష్ణ చంద్ర సగారియా బహిష్కరణను సైతం పార్టీ రద్దు చేసింది. వీరిపై పార్టీ క్రమశిక్షణ చర్యలు తీసుకున్నప్పటికీ పార్టీకి విధేయులుగా ఉన్నారు. దీంతో సోమవారం రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి అజోయ్ కుమార్‌తో వీరు సమావేశమై పార్టీ నుంచి తమ సస్పెన్షన్ రద్దు చేసే అంశంపై చర్చించారు. అనంతరం మీడియాతో అజోయ్ కుమార్ మాట్లాడుతూ మహ్మద్ మొకీం, చిరంజీబ్ బిస్వాల్‌లు కాంగ్రెస్‌కు బలమైన నాయకులన్నారు. రాష్ట్రంలో పార్టీ విజయాలకు దోహదపడ్డారని పేర్కొన్నారు. వారితో ఉన్న అపార్థాలన్నీ తొలగిపోయాయని, త్వరలో వారు మరలా పార్టీలోకి వస్తారని తెలియజేశారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాల కారణంగా 2023 జూలై 16న అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) మహ్మద్ మొకీం, చిరంజీబ్ బిస్వాల్‌లను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. వీరివురి వ్యతిరేకంగా తనకు ఫిర్యాదులు అందాయని ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శరత్ పట్నాయక్ పేర్కొని సస్పెన్షన్ ఉత్తర్వులకు ప్రేరేపించారు. ఫిర్యాదుల ఆధారంగా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, పార్టీ క్రమశిక్షణా చర్యల కమిటీ (డీఏసీ) సభ్యుడు తారిక్ అన్వర్ వివరణ కోరుతూ ఇద్దరు నేతలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అదేవిధంగా పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారనే ఆరోపణతో 2019లో కృష్ణచంద్ర సగారియాను సస్పెండ్ చేశారు.

కాంగ్రెస్ బలోపేతానికి చర్యలు

ఒడిశా పార్టీ ఇన్‌చార్జిగా అజోయ్ కుమార్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత రాష్ట్ర నాయకులను ఒక తాటిపైకి తీసుకు రావడానికి ప్రయత్నిస్తున్నారు. రాష్ట్ర కాంగ్రెస్‌లో అయోమయ పరిస్థితి తొలగించి సమైక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా రాష్ట్రంలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ నుంచి పలు కారణాలు, పరిస్థితుల్లో దూరమైన నాయకులు, ఇతర ప్రముఖులను మరలా చేర్చుకోవాలని సంకల్పించారు. ఈ నేపథ్యంలో పలువురు మాజీ నాయకులకు పార్టీలో పునఃప్రవేశం కల్పిస్తున్నారు. దీనిలో భాగంగానే ఇటీవల రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి గిరిధర్ గొమాంగో మరలా కాంగ్రెస్‌లోకి వచ్చారు.

క్లుప్తంగా

కొరాపుట్ కలెక్టర్‌గా కీర్తి వాసన్



కలెక్టర్ కీర్తి వాసన్

కొరాపుట్: జిల్లా నూతన కలెక్టర్‌గా వి.కీర్తి వాసన్ నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం గంజాం జిల్లా డీఆర్‌డీఏ పీడీగా పని చేస్తున్నారు. పదోన్నతిపై కొరాపుట్ జిల్లాకి వస్తున్నారు. 2018 ఐఏఎస్ బ్యాచ్‌కి చెందిన కీర్తి స్వస్థలం తమిళనాడు రాష్ట్రం. మరోవైపు ప్రస్తుత కొరాపుట్ జిల్లా కలెక్టర్ అబ్దుల్ మహ్మద్ అక్తర్ బదిలీపై అనుగుల్ జిల్లా కలెక్టర్‌గా వెళ్తున్నారు. అక్తర్ పనిచేసిన సమయంలో జిల్లాలోని దేవమాలి, పుట్ సీల్, పుంజిసీల్, డుడమా, రాణీ డుడుమా, గుప్తేశ్వరం తదితర ప్రాంతాల్లో పర్యాటక రంగం గణనీయమైన అభివృద్ధి సాధించింది.

పేరు మారింది



మాణికొగొడాగా పేరు మార్చిన దృశ్యం

భువనేశ్వర్: బొలాగొడో ప్రాంతీయుల దీర్ఘకాలిక కోరిక నెరవేరింది. స్థానికుల నిరవధిక అభ్యర్థన పరిగణనలోకి తీసుకుని బొలాగొడో స్టేషను పేరుని మాణికొగొడా స్టేషనుగా రైల్వే అధికారులు మార్చారు. ఈ నిర్ణయం తక్షణమే అమలు చేసినట్లు రైల్వే శాఖ ప్రకటించింది.

ప్రాణం విలువ గుర్తించాలి



అవగాహన కల్పిస్తున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు

ఎచ్చెర్ల క్యాంపస్: వాహన చోదకులు ప్రాణం విలువ గుర్తించి బండి నడపాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.అనిల్ అన్నారు. ఎచ్చెర్లలోని రోడ్డు రవాణాశాఖ కార్యాలయంలో వాహనచోదకులకు రోడ్డు భద్రతపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించటం, పరిమితిలో వేగం పాటించడం, నిద్ర మత్తులో వాహనాలు నడపకపోవటం, సీటు బెల్టు ధరించడం కీలకమని చెప్పారు. నిర్లక్ష్యపు డ్రైవింగే రోడ్డు ప్రమాదాలకు కారణమని తెలిపారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పీవీ గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.రెండు వందల కోట్లతో జలజీవన్ పనులు



చీడిపేటలో జల్‌జీవన్ పనుల కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న డీఈఈ

జి.సిగడాం: ఎచ్చెర్ల నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సుమారుగా రూ.రెండు వందల కోట్లతో జలజీవన్ పనులు జరుగుతున్నాయని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ పైడి సూర్యనారాయణ వెల్లడించారు. ఆయన మంగళవారం మండలంలోని విజయరాంపురం, దవళపేట, చీడిపేట, వాండ్రంగి, గ్రామాల్లో పలు పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేయడంతో తాగునీటి సమస్య పూర్తిగా పరిష్కారమవుతుందని తెలిపారు. దవళపేట, వాండ్రంగిలో ట్యాంకు పనుల కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈఈ బగాది భాగ్యలక్ష్మి, సర్పంచులు సాకేటి నాగరాజు, వడిశ మహేశ్వరరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ మాచర్ల గోపాలం, ముగ్గు లోకేష్ ఉన్నారు.

అదృశ్యమైన వ్యక్తి మృతి



నందిగాం : ఈ నెల 17 నుంచి కనిపించకుండాపోయిన నందిగాంకు చెందిన కొన్న సోమేశ్వరరావు(53) వజ్రపుకొత్తూరు మండలం బెండి రైల్వే బ్రిడ్జి కింద ఉన్న వాగులో శవమై తేలాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమేశ్వరరావు కనిపించకపోవడంతో సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టడంతో పాటు నందిగాం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై మహమ్మద్ అమీర్ ఆలీ మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇంతలో సోమవారం బెండి గేటు సమీపంలో ట్రాక్ పరిశీలిస్తున్న సిబ్బందికి బ్రిడ్జి క్రింద ఉన్న వాగులో శవం కనిపించింది. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు మృతుడు వేసుకున్న షర్టును బట్టి సోమేశ్వరరావుగా గుర్తించారు. పలాస రైల్వే ఎస్సై ఎస్‌కే షరీఫ్ ఆధ్వర్యంలో శవపంచనామా జరిపి మృతదేహాన్ని మంగళవారం కుటుంబసభ్యులకు అప్పగించారు.

ఆదర్శనీయుడు నేతాజీ



భువనేశ్వర్: సుభాష్ బోస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గవర్నర్ రఘుబర్ దాస్

నేటి యువత నేతాజీ సుభాష్ చంద్రబోస్‌ను ఆదర్శంగా తీసుకోవాలని వక్తలు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా నేతాజీ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దేశానికి నేతాజీ చేసిన సేవలను కొనియాడారు. స్వాతంత్య్రం కోసం సాగించిన పోరాటాన్ని గుర్తు చేసుకున్నారు. ప్రతి ఒక్కరూ ఆయన అడుగు జాడల్లో నడవాలని పిలుపునిచ్చారు.

– సాక్షి నెట్‌వర్క్



భువనేశ్వర్: నేతాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్



కొరాపుట్: ఉమ్మర్ కోట్‌లో బోస్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నబరంగ్‌పూర్ ఎంపీ రమేష్ చంద్ర మజ్జి



జయపురం: నేతాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కమ్యూనిస్టులు



రాయగడ: కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



జయపురం: బోసు విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



బరంపురం: నేతాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆప్ నాయకులు



రాయగడ: మాట్లాడుతున్న రాజ్యసభ మాజీ సభ్యుడు నెక్కంటి



మల్కన్‌గిరి: నేతాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



రాయగడ: గుణుపూర్‌లో రక్తదానం చేస్తున్న యువకులు



బరంపురం: నేతాజీ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎంపీ చంద్రశేఖర్ తదితరులు



బరంపురం: నేతాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



కొరాపుట్: నబరంగ్‌పూర్‌లో నేతాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ కమలోచన్



పర్లాకిమిడి: నేతాజీ విగ్రహానికి నివాళులు

క్రీడలతో మానసికోల్లాసం



జెండా ఊపి మినీ మారథన్ ప్రారంభిస్తున్న ఐఐటీ డైరెక్టర్ కర్మల్కర్



యోగా నిర్వహిస్తున్న విద్యార్థులు

భువనేశ్వర్: ఫిట్ ఇండియా వీక్ సందర్భంగా స్థానిక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)లో క్రీడలు, ఫిట్‌నెస్ కార్యకలాపాలు మంగళవారం నిర్వహించారు. కేంద్ర క్రీడలు మరియు యువజన వ్యవహారాల శాఖ నేతృత్వంలో ఫిట్ ఇండియా ఉద్యమంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఫిట్‌నెస్ మన దైనందిన జీవితంలో అంతర్భాగంగా మార్చే లక్ష్యంతో 2019 సంవత్సరంలో ఈ ఉద్యమానికి శ్రీకారం చుట్టినట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీపాద్ కర్మల్కర్ తెలిపారు. చురుకైన జీవనశైలి కోసం శారీరక ప్రవర్తన మార్పులను తీసుకు రావడంలో క్రీడలు ప్రముఖ పాత్ర పోషిస్తాయన్నారు. డైరెక్టర్ క్రీడా పతాకం ఊపి మినీ మారథాన్ ప్రారంభించడంతో క్రీడోత్సాహం పుంజుకుంది. కార్యక్రమంలో రిజిస్ట్రార్ బామదేవ్ ఆచార్య పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఫిట్ ఇండియా మూమెంట్ నోడల్ అధికారి డాక్టర్ బంకిం చంద్ర మండల్ కార్యక్రమానికి సమన్వయకర్తగా వ్యవహరించారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు



మాట్లాడుతున్న వీకే పాండియన్



క్రీడా పోటీల విజేతలకు చెక్కు అందజేస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని 5టీ కార్యదర్శి వి.కె. పాండియన్ అన్నారు. స్థానిక గజపతి స్టేడియంలో నువా ఒడిశా – నవీన్ ఒడిశా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిరోజూ ఉదయం వ్యాయామం చేయాలని సూచించారు. ఓటములు ఎదురైనా ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగితే విజయం వరిస్తుందని సూచించారు. విద్యార్థులు వీలైనంతవరకు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. 5టీలో భాగంగా గజపతి జిల్లాలోని 17 కళాశాలల్లో స్మార్ట్ క్లాసులు, ఈ-లైబ్రరీలు ఏర్పాటు చేయగలిగామన్నారు. మరికొన్ని కళాశాలల్లో మార్చి నాటికి పనులు పూర్తవుతాయని వెల్లడించారు. అనంతరం విద్యార్థులతో సెల్ఫీ దిగారు. కార్యక్రమంలో దక్షిణ మండలం డీజీ సత్యవ్రత భోయి, కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్, ఎస్పీ స్వాతి ఎస్. కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్‌ఎఫ్ క్యాంప్‌ల సందర్శన



తులసీ పాహడ్‌లో గిరిజనులకు దుస్తులు అందజేస్తున్న దృశ్యం

మల్కన్‌గిరి: జిల్లాలో డిప్యూటీ జనరల్ ఆఫ్ పోలీసు ఎస్.దేవ్‌దత్ సింగ్ మంగళవారం పర్యటించారు. ముందుగా ఎస్పీ నితీష్ కుమార్ వాద్వానీ, కలెక్టర్ విశాల్ సింగ్, బీఎస్‌ఎఫ్ డీఐజీ సైలేంద్ర కుమార్‌తో కలిసి మావో కార్యకలాపాలపై చర్చించారు. అనంతరం చిత్రకొండ సమితిలో ఉన్న గుర్రసేత్, పొప్పరమేట్ల, హంతాల్‌గూడ, మత్తిలి సమితిలోని తులాశి పాహడ్‌లో ఉన్న బీఎస్‌ఎఫ్ క్యాంప్‌లను సందర్శించారు. అక్కడి ప్రజలకు దుస్తులు, స్కూల్ బ్యాగ్‌లు, ఇతర సామగ్రి అందజేశారు.

‘ఇంటింటా శంఖం’ ప్రారంభం



హట్ బజారులో ఇంటింటా శంఖం కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: బిజూ జనతా దళ్ పార్టీ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటా శంఖం కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. జట్నీ మున్సిపాలిటీ 15వ నంబర్ వార్డు హట్ బజారు నుంచి ప్రారంభించారు. బీజేడీ ఖుర్దా జిల్లా శాఖ అధ్యక్షుడు బిభూతి భూషణ్ బల్వంతరాయ్ పాల్గొన్నారు. ఈయనతో స్థానిక వార్డు కార్పొరేటర్ జటాధరి ప్రధాన్ ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు. నవీన్ పట్నాయక్ నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు ప్రజాహిత పథకాలు, కార్యక్రమాలపై అవగాహన కల్పించేందుకు ఇంటింటా శంఖం కార్యక్రమం సంకల్పించినట్లు బిభూతి భూషణ్ బల్వంత్రాయ్ తెలిపారు. ప్రజల అభీష్టం మేరకు ఇంటి గోడకు బిజూ జనతా దళ్ గుర్తు శంఖం స్టిక్కర్ అంటిస్తున్నారు.

వర్సిటీ స్వయం ప్రతిపత్తి కాపాడాలి



ర్యాలీ నిర్వహిస్తున్న జిల్లా ప్రైవేట్ కళాశాలల యాజమాన్య ప్రతినిధులు

ఎచ్చెర్ల క్యాంపస్: విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తి కాపాడాలని ప్రైవేట్ డిగ్రీ కళాశాల యాజమాన్యాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు మంగళవారం వర్సిటీ ఆవరణలో ర్యాలీ నిర్వహించిన కాలేజీల యాజమాన్య ప్రతినిధులు వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ కె.ఆర్.రజినికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అఖిల భారత సాంకేతిక విద్యా మండలి అనుమతులు డిగ్రీ కోర్సులకూ అవసరమైతే కళాశాలలకు ఆర్థిక భారమని చెప్పారు. తక్కువ ఫీజు స్ట్రక్చర్‌తో నిర్వహిస్తున్న కళాశాలలకు కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో ఇబ్బంది కలుగుతుందన్నారు. ఇప్పటికే యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నిబంధనలు డిగ్రీ కళాశాలు పాటిస్తున్నాయని గుర్తు చేశారు. బీబీఏ, బీసీఏ కోర్సుకు ఐదు లక్షలు సెక్యూరిటీ డిపాజిట్ కట్టడం సాధ్యం కాదన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రైవేట్ కళాశాలల అసోసియేషన్ అధ్యక్షుడు పొన్నాల జయరాం, సెక్రటరీ కోట మురళీధర్, కోశాధికారి బింగి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎయిమ్స్‌లో డ్రోన్ సేవలు



ఎయిమ్స్ ఆవరణలో డ్రోన్ సేవల ప్రయోగం

భువనేశ్వర్: రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా స్థానిక అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్)లో మంగళవారం డ్రోన్ ద్వారా ఆరోగ్య సేవలను ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్లడ్ బ్యాగ్ డెలివరీ విజయవంతంగా నిర్వహించింది. ఈ ప్రయత్నంలో భాగంగా దాదాపు 70 కి.మీల వైమానిక దూరంలో ఉన్న ఖుర్దా టంగి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)కి ఒక యూనిట్ రక్తం 37 నిమిషాల్లో చేరవేశారు.

ముందస్తు అనుమతితో

ట్రయల్ రన్ కోసం ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ) భువనేశ్వర్ నుంచి అవసరమైన ముందస్తు అనుమతి పొందారు. 12 కిలోల బరువున్న ఈ డ్రోన్ 2 నుంచి 5 కిలోల వరకు మందులు, బ్లడ్ యూనిట్లు మరియు ఇతర అవసరమైన మెడికల్ కిట్‌లను మోయగలదు. గంటకు 90 కి.మీ వేగంతో ప్రయాణిస్తుంది. జీపీఎస్ ఉపయోగించి డ్రోన్ కదలికని పరిశీలించేందుకు వీలవుతుంది. భారత ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు స్థానిక ఎయిమ్స్ తొలిసారిగా డ్రోన్ ద్వారా ఆరోగ్య సేవలను అందించింది. ఈ సాంకేతిక పరిజ్ఞానంతో ఎలాంటి సేవలు అందించవచ్చో ప్రయోగాలు చేసి పరిశీలిస్తున్నామని ఎయిమ్స్ డైరెక్టర్ అశుతోష్ బిస్వాస్ తెలిపారు. డ్రోన్ ద్వారా అత్యవసర మందులు, ఇంజెక్షన్‌లను డెలివరీ చేసే ప్రతిపాదనను కూడా పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో మెరుగైన సేవలను అందించడంలో మరియు తుఫాన్లు, వరదలు వంటి విపత్కర పరిస్థితుల్లో డ్రోన్‌లు రవాణా, రహదారి పరిస్థితులకు అతీతంగా గమ్యం చేరగలుగుతాయన్నారు. ఈ నెల 25న పెద్ద ఎత్తున మరో ప్రయోగం నిర్వహిస్తామని తెలిపారు. ఈ ప్రయోగం విజయవంతం అవుతుందని ఆశిస్తున్నట్లు వివరించారు.

క్లుప్తంగా

గడ్డిమందు తాగి వ్యక్తి ఆత్మహత్య


తవిటినాయుడు మృతదేహం

గరుగుబిల్లి: మండలంలోని గిజబ గ్రామానికి చెందిన మరడాన తవిటినాయుడు (50) మంగళవారం వేకువ జామున గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మద్యానికి బానిసైన తవిటినాయుడిని నిత్యం మద్యం తాగితే ఎలా అని భార్య ప్రశ్నించడంతో మనస్తాపానికి గురై పంటలకు వినియోగించగా ఇంట్లో మిగిలి ఉన్న గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు ఆడ పిల్లలున్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు స్థానిక హెచ్‌సీ ఎన్.ఈశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకున్న చిత్రలేఖనం పోటీలు


చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

విజయనగరం అర్బన్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో ఈ నెల 29న జరిగే 'పరీక్షా పే చర్చ' కార్యక్రమం స్ఫూర్తిని తెలిపేందుకు స్థానిక కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థులకు మంగళవారం నిర్వహించిన చిత్రలేఖనం పోటీలు ఆకట్టుకున్నాయి. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి వచ్చిన 100 మంది విద్యార్థులు పోటీలో పాల్గొన్నారు. పోటీల అనంతరం న్యాయనిర్ణేతలు ఎంపిక చేసిన ఐదు మంచి చిత్రలేఖనాలకు గవర్నమెంట్ ఆఫ్ ఇండియా పంపిన పుస్తకాలను, ప్రశంసా పత్రాలు బహుమతులను విద్యాలయం ప్రిన్సిపాల్ దిలీప్ మోడీ అందజేశారు.

సైబర్ యాక్ట్ కింద కేసు నమోదు

విజయనగరం క్రైమ్: వాట్సాప్‌లో పార్ట్ టైమ్ జాబ్స్‌కు సంబంధించి వచ్చిన మెసెజ్‌కి స్పందించి రూ. 37 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు వన్‌టౌన్ పోలీసులు మంగళవారం ఫిర్యాదు చేయగా సైబర్ యాక్ట్ కింద కేసు నమోదైంది. ఈ ఫిర్యాదు వివరాలిలా ఉన్నాయి. కంటోన్మెంట్ ప్రాంతంలో నివాసం ఉంటున్న సురేష్‌బాబు ఇన్సూరెన్స్ అడ్వయిజర్‌గా పనిచేస్తున్నాడు. పార్ట్ టైమ్ జాబ్స్ ఉన్నాయని వాట్సాప్‌లో మెసెజ్ రావడంతో తన వివరాలు అప్‌లోడ్ చేశాడు. అటునుంచి వచ్చిన ప్రతి టాస్క్‌ను పూర్తిచేసుకుంటూ వచ్చాడు. రూ.100 కడితే రూ.150 వచ్చింది. అలా రూ.2వేల వరకూ తన ఖాతాలో జమ చేసుకున్నాడు. తర్వాత ప్రీపెయిడ్ టాస్క్‌లు పెట్టడంతో రూ.10కి పది వస్తుందని చెప్పడంతో డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయడం ప్రారంభించాడు. తన అకౌంట్‌లోకి లక్షలు వచ్చినట్లు కనబడుతుంటాయి. కానీ అవి తీసుకోవాలంటే వేలకువేలు కట్టాలనే నిబంధన ప్రకారం దపదఫాలుగా రూ.37 లక్షలు కట్టేశాడు. చివరకూ మోసపోయానని గ్రహించి లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు సైబర్ యాక్ట్ కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్య, వైజ్ఞానిక సదస్సులో ప్రతిభ


నిర్వాహకులతో సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు, ఉపాధ్యాయురాలు

రాజాం సిటీ: శ్రీకాకుళంలోని మహిళా డిగ్రీ కళాశాలలో ఈ నెల 21న నిర్వహించిన సాంఘిక శాస్త్ర విద్య, వైజ్ఞానిక సదస్సులో రాజాం మున్సిపాల్టీ పరిధి బుచ్చెంపేట ఎంపీపీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మన సంస్కృతి-నాగరికత ఉట్టిపడేలా జానపద కళలు, నాటికలు, ఏకపాత్రాభినయం ప్రదర్శించారని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వడ్డి ఉషారాణి మంగళవారం తెలిపారు. ఈ ప్రదర్శనలకు జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి లభించిందని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రదర్శన పట్ల శ్రీకాకుళం డీఈఓ దేవానంద్‌రెడ్డి, కార్యక్రమ అధ్యక్షుడు కేశవరావులు హర్షం వ్యక్తం చేస్తూ నగదు బహుమతి, మెమెంటో, సర్టిఫికెట్లు అందించారని తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఏఈఓ మృతి

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి రోడ్డులో మంగళవారం ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యవసాయశాఖలో పనిచేస్తున్న ఏఈఓ గొర్లె సత్యనారాయణ (34) మృతిచెందారు. ఈ ప్రమాదంపై సీఐ డి.మోహనరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక మార్కెట్ యార్డులోని అగ్రిల్యాబ్‌లో సత్యనారాయణ విధులు నిర్వహిస్తున్నాడు. ఎప్పటిలాగే విధులు ముగించుకుని రాజాం నుంచి స్వగ్రామం వంగర మండలం ఎం.సీతారాంపురం ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. అమ్మవారి గుడిదాటిన తరువాత బొబ్బిలి రోడ్డులో వెనుక నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య ఇందిర, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజాం సీహెచ్‌సీకి తరలించామని, మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

పోలమాంబ పాహిమాం!!

- అంబరాన్నంటిన 'శంబరం'
- కనుల పండువగా శంబర పోలమాంబ సిరిమానోత్సవం
- తరలివచ్చిన భక్తజనం
- అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన డిప్యూటీ సీఎం రాజన్నదొర
- అధికార యంత్రాంగం కృషితో సజావుగా సాగిన జాతర



శంబర పోలమాంబ సిరిమానోత్సవ సందడి, (ఇన్‌సెట్లో) శంబర పోలమాంబ అమ్మవారు

మక్కువ: మంగళ వాయిద్యాలు.. భక్తుల జయ జయ ధ్వానాలు.. సాంస్కృతిక ప్రదర్శనల నడుమ శంబర పోలమాంబ సిరిమానోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా సాగింది. సిరిమాను పూజారి రూపంలో అమ్మవారు మక్కువ మండలంలోని శంబర వీధుల్లోకి అరుదెంచిన వేళ భక్తులు పులకించిపోయారు. పోలమాంబ పాహిమాం!!.. చల్లంగ చూడమ్మా.. పోలమాంబమ్మా.. అంటూ ప్రార్థించారు. పోలమాంబ సిరిమానోత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన లక్షలాది మంది భక్తులతో శంబర గ్రామం జనసంద్రంగా మారింది. రాష్ట్రంలోని నలుమూలలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. గోముఖినదిలో పుణ్యస్నానాలాచరించి అమ్మవారిని దర్శించారు. మొక్కుబడులు చెల్లించారు.

సిరిమానోత్సవం సాగిందిలా..

మధ్యాహ్నం మూడు గంటల సమయంలో సిరిమానోత్సవాన్ని ప్రారంభించాలని అధికారులు భావించారు. అయితే, ఘటాలను తీసుకురావడంలో ఆలస్యం కావడంతో మధ్యాహ్నం 4.35 నిమిషాలకు పూజారి జన్ని పేకాపు భాస్కరరావు, అలియాస్ జగదీశ్వరరావు సిరిమానును అధిరోహించారు. దీంతో ఏటా నిర్వహించిన సమయం కన్నా, సుమారు గంట సమయం ఆలస్యంగా ఉత్సవం ప్రారంభమైంది. ఆనవాయితీ ప్రకారం ముందుగా గిరడ, ఆ తరువాత మునసబు, కరణం కుటుంబాల వారు పూజలు చేశారు. అక్కడ నుంచి పనుకువీధి, గొల్లవీధి, జన్నివీధుల మీదుగా సాయంత్రం 5.42 నిమిషాలకు సిరిమాను ప్రధానాలయం సమీపంలోకి చేరుకుంది.

సంప్రదాయబద్ధంగా ఘటాలకు పూజలు

ముందుగా జన్నివారి ఇంటి నుంచి ఘటాలను అమ్మవారి ఆలయంలోకి తీసుకొచ్చి పూజలు చేశారు. అనంతరం సిరిమాను ఉండే ప్రదేశానికి తీసుకెళ్లారు. ప్రధానాలయం నుంచి అమ్మవారు వచ్చే మార్గంలో నేలపై చీరలను పరిచి వాటిపై చిన్నారులను పడుకోబెట్టగా.. వారిపైనుంచి అమ్మవారి ఘటాలను దాటించారు. జన్నివారి ఇంటి నుంచి అమ్మవారి ఘటాలను గిరడ వారింటికి, ఆ తరువాత మునసబు, కరణం ఇళ్లకు తీసుకెళ్లి పూజలు చేశారు. మంగళవారం రాత్రంతా అమ్మవారి ఘటాలను గ్రామంలో తిరువీధి చేసి, బుధవారం ఉదయం 10 గంటల సమయానికి ప్రధాన రహదారి వద్ద అమ్మవారి గద్దెకు చేర్చుతారు. అక్కడ అమ్మవారి ఘటాలకు ఉయ్యాలకంబాలు కార్యక్రమం నిర్వహిస్తారు. అనుపోత్సవం కార్యక్రమంలో భాగంగా అమ్మవారి ఘటాలను వనంగుడికి తీసుకువెళ్తారు.


తిరువీధికి బయలుదేరిన అమ్మవారి ఘటాలు


జాతరకు వస్తున్న భక్తులు

అమ్మవారి సేవలో నేతలు

అమ్మవారికి ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలను డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర సమర్పించగా, ఆలయ అధికారులు, అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు, జేసీ ఆర్.గోవిందరావు, బొబ్బిలి మున్సిపల్ చైర్మన్ షావు మురళీకృష్ణ, సాలూరు ఏఎంసీ చైర్మన్ దండి అనంతకుమారి, వైఎస్సార్‌సీపీ మక్కువ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు అమ్మవారిని దర్శించుకున్నారు.



తగ్గిన భక్తుల రద్దీ

గతేడాది రెండులక్షల మందికిపైగా భక్తులు అమ్మవారి జాతరను తిలకించేందుకు రాగా, ఈ ఏడాది మాత్రం అధికారుల అంచనాలను తలకిందులు చేస్తూ భక్తుల తాకిడి తగ్గింది. పది వారాల వరకు అమ్మవారి జాతర నిర్వహిస్తున్నట్టు దేవదాయశాఖ ప్రచారం చేయడం, తొలివారం భక్తుల రద్దీ ఉంటుందని, పిల్లలతో వెళ్లడం క్షేమకరం కాదని చాలామంది భక్తులు అమ్మవారి దర్శనాన్ని వాయిదా వేసుకున్నట్టు అధికారులు భావిస్తున్నారు. వేకువ జాము నుంచి ఉదయం 11 గంటల వరకు భక్తుల తాకిడి తక్కువగా కనిపించింది. ఆపై ఇతర ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో శంబర గ్రామం కిటకిటలాడింది. గ్రామంలోని రహదారులన్నీ రద్దీగా మారాయి.

తప్పిపోయిన చిన్నారుల అప్పగింత


తప్పిపోయిన బాలుడిని తండ్రి పాపారావుకు అప్పగిస్తున్న ఎస్‌ఐ నరసింహమూర్తి

మక్కువ: శంబర పోలమాంబ అమ్మవారి జాతరలో తప్పిపోయిన చిన్నారులను, వృద్ధులను పోలీసులు వారివారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మండలంలోని బట్టివలస గ్రామానికి చెందిన అడ్డాకుల ధనుష్ అనే బాలుడు తప్పిపోవడంతో పోలీసులు ఆరా తీసి గ్రామానికి తీసుకెళ్లి బాలుడు తండ్రి పాపారావుకు అప్పగించారు. అలాగే, పాచిపెంట మండలానికి చెందిన బాలుడు ఎల్.షన్ముఖ, మరో ముగ్గురు చిన్నారులు, వృద్ధురాలిని కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు ఎస్‌ఐ నరసింహమూర్తి తెలిపారు.


గోముఖి నదీతీరంలో భక్తసందోహం

ఫలించిన అధికారుల కృషి..

గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా అధికారులు సమన్వయంతో పనిచేసి క్యూలైన్లు ఏర్పాటు, బస్సుల రాకపోకలు, ట్రాఫిక్ మళ్లింపు వంటి చర్యలు పక్కాగా అమలు చేయడంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగలేదు. ఎస్పీ విక్రాంత్‌పాటిల్, అడిషనల్ ఎస్పీ డాక్టర్ దిలీప్‌కిరణ్, ఏఎస్పీ సునిల్‌షోరేన్, ఆర్డీఓ హేమలత, డీఎస్పీలు మురళీధర్, కృష్ణ, దిశ డీఎస్పీ హర్షిత ఎప్పటికప్పుడు జాతరను పర్యవేక్షిస్తూ సిబ్బందికి సూచనలిచ్చారు. క్యూ కాంప్లెక్స్‌ల సమీపంలోనే తలనీలాలు సమర్పించే శిబిరం, అక్కడకు సమీపంలోనే కోళ్లు, గొర్రెలు మొక్కులు తీర్చుకొనే ప్రదేశాన్ని కేటాయించడం భక్తులకు కలిసొచ్చింది. ఎస్పీ పర్యవేక్షణలో 700 మంది పోలీసులు విధులు నిర్వహించారు. డ్రోన్ కెమెరాతో పాటు, 41 చోట్ల సీసీ కెమెరాలు అమర్చి జాతరను పర్యవేక్షించారు. సిరిమాను వద్ద రోప్‌పార్టీ భక్తుల తోపులాటలు జరగకుండా నివారించారు. జిల్లా దేవదాయశాఖ అధికారి డి.వి.వి ప్రసాదరావు, ఈఓ వి.వి.సూర్యనారాయణ, సాలూరు సీఐ ధనంజయరావు ఎప్పటికప్పుడు భక్తులకు సూచనలిచ్చారు. పార్వతీపురం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని ఆర్టీసీ డిపోల నుంచి 150 బస్సులను ఆర్టీసీ నడిపించింది. ఆర్టీసీ సీఎంఈ శ్రీనివాసరావు, డీపీటీఓ అప్పలనారాయణ బస్సు సర్వీసులను పర్యవేక్షించారు.


అమ్మవారి దర్శనానికి వచ్చిన జేసీ గోవిందరావు దంపతులు


అమ్మవారిని దర్శించుకుంటున్న ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర


అమ్మదర్శనానికి శంబర చేరుకున్న బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు


జాతరను సమీక్షిస్తున్న అదనపు ఎస్పీ దిలీప్ కిరణ్, ఆర్డీఓ హేమలత


తలనీలాలు సమర్పించుకుంటున్న చిన్నారి

విద్యుత్ స్తంభాలను ఢీకొన్న టిప్పర్

- నేలకొరిగిన 13 స్తంభాలు
- ఐదు గ్రామాల్లో అలుముకున్న చీకట్లు


టిప్పర్ ఢీకొనడంతో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

మెంటాడ: మండలంలో నిర్మాణం జరుగుతున్న గ్రీన్‌ఫీల్డ్ రహదారి పనుల్లో భాగంగా మెటీరియల్‌ను తీసుకువెళ్తున్న టిప్పర్‌కు మంగళవారం తెలవారుజామున విద్యుత్‌వైర్ తగలడంతో ఆగకుండా చాలా దూరం వెళ్లిపోగా వరుసగా 13స్తంభాలు నేలకొరిగాయని విద్యుత్‌శాఖ ఏఈ తిరుపతిరావు తెలిపారు. ఈ మేరకు విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఒక్కసారిగా 13 స్తంభాలు నేలకొరగడంవల్ల సారాడవలస, మల్లేడవలస, సంగం గుడ్డివలస, శిగడంవలస, కిందగూడెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఆగిపోయిందని తెలిపారు. అయితే విద్యుత్ సరఫరా పనులు పునరుద్ధరణ జోరుగా చేయనున్నట్లు తెలిపారు. బుధవారం సాయంత్రానికి ఈఐదు గ్రామాలకు పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా జరుగుతుందని పేర్కొన్నారు.

విద్యుత్ షాక్‌తో జూనియర్ లైన్‌మన్ మృతి


జూనియర్ లైన్‌మన్ మృతదేహం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని గుషిణి గ్రామ పంచాయతీ బర్లపేట పంటపొలాల్లో విద్యుత్ ఘాతానికి గురై జూనియర్ లైన్‌మన్ మంగళవారం మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి ఎస్సై రామగణేష్, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జామి గ్రామంలోని కొత్తవీధికి చెందిన రెడ్డి కోటరావు(27) గడిచిన రెండేళ్లుగా గుషిణి సచివాలయం పరిధిలో గ్రేడ్-2 సచివాలయ జూనియర్ లైన్‌మన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. మంగళవారం ఉదయం బర్లపేట సమీపంలో ఉన్న పంట పొలాల్లో కొత్తగా ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ వైర్లు కలిపేందుకు పోల్ ఎక్కగా..11 కేవీ విద్యుత్ వైర్లు తగలడంతో షాక్ కొట్టి స్తంభంపై నుంచి కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఎల్‌సీ తీసుకోవడంలో పొరపాటు జరగడంతో ఈ ఘటన జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు ఘటనాస్థలికి వెళ్లి కుమారుడి మృతదేహాన్ని చూసి తీవ్రంగా రోదించారు. చేతికి అందివచ్చిన కొడుకు అర్ధాంతరంగా మృతిచెందడంతో శోకసంద్రంలో మునిగిపోయారు. ఏఈ పిచ్చయ్య అందించిన సమాచారంతో పోలీసులు ఘటనాస్థలికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రామగణేష్ తెలిపారు.

కొండపై నుండి జారిపడి యువకుడు


మురళి మృతదేహం

పాచిపెంట: ఫొటోలు తీసుకునే క్రమంలో బీపీ డౌన్ అయి ప్రమాదవశాత్తు కొండపై నుంచి కిందకు జారిపడి ఓ యువకుడు మృతిచెందాడు. పాచిపెంట మండలంలో జరిగిన ఈ సంఘటనపై ఎస్సై నారాయణరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని చీపురువలస సమీపంలో పారమ్మకొండ మీదకు సాలూరు మండలం కూర్మరాజుపేటకు చెందిన అప్పికొండ మురళి (18), అదే గ్రామానికి చెందిన తన మేనల్లుడు బి.గణేష్‌తో కలిసి ఎక్కారు. అక్కడ దేవుడిని దర్శించుకున్న తరువాత మురళి తనతో తీసుకువచ్చిన ఫోన్‌లో ఫొటోలు తీయమని కొండ చివరలో నిల్చున్నాడు. అయితే మురళికి లో బీపీ ఉండడం వల్ల కళ్లు తిరిగి, కొండపై నుంచి కిందకు జారిపడి మృతిచెందాడు. మృతుడి తండ్రి శంకరరావు ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

చిట్టంపాడులో అధికారుల పర్యటన


చిట్టంపాడులో పర్యటిస్తున్న అధికారుల బృందం

శృంగవరపుకోట: మండలంలోని మూలబొడ్డవర పంచాయతీ పరిధిలో చిట్టంపాడు గ్రామంలో అధికారుల బృందం మంగళవారం పర్యటించింది. గ్రామానికి చెందిన ఏడాదిన్నర బాలుడు జన్ని శ్రావణ్ సోమవారం చనిపోయిన ఉదంతం పత్రికల్లో ప్రచురితం కావడంతో అధికారయంత్రాంగం అప్రమత్తమైంది. ఈ మేరకు మంగళవారం బాలల హక్కుల కమిటీ చైర్మన్ కేసలి అప్పారావు, డిప్యూటీ కలెక్టర్ సుదర్శన్‌దొర, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి భాస్కరరావు, జిల్లా మలేరియా అధికారిణి వై.మణి, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ శేషుబాబు, వైద్యారోగ్య శాఖ సిబ్బంది, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, పంచాయతీ కార్యదర్శి బంగారునాయుడు తదితరులు గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మృతుడి తల్లిదండ్రులను పరామర్శించి ఓదార్చారు. డీఎంహెచ్‌ఓ భాస్కరరావు పర్యవేక్షణలో గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి గ్రామస్తులకు వైద్యపరీక్షలు చేశారు.

జీఎంఆర్ ఐటీ విద్యార్థినుల 'పవర్'

రాజాం సిటీ: స్థానిక జీఎంఆర్ ఐటీ విద్యార్థినులు సౌత్ ఇండియా సబ్‌జూనియర్, జూనియర్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ కనబరిచారని పీడీ బీహెచ్ అరుణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఈ నెల 22 వరకు గుంటూరు జిల్లా తెనాలి జేఎంజే ఉమెన్స్ కళాశాలలో ఈ పోటీలు జరిగాయన్నారు. 43 కేజీల విభాగంలో పి.బాలయక్షిత (జూనియర్) బంగారు పతకం, 52 కేజీల విభాగంలో ఎస్.కృష్ణవేణి (సబ్ జూనియర్) వెండి పతకం, 47 కేజీల విభాగంలో డి.సంధ్య, 105 కేజీల విభాగంలో చైతన్యలు జూనియర్ విభాగానికి సంబంధించి రజత పతకాలు సాధించారని తెలిపారు. వారి ప్రతిభపట్ల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్‌ఎస్‌వీ ప్రసాద్, ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్, స్టూడెంట్స్ డీన్ డాక్టర్ వి.రాంబాబు, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

రామభద్రపురం: మండలంలోని ఆరికతోట గ్రామ శివారులో ఎస్సై జ్ఞానప్రసాద్ సిబ్బందితో కలిసి సారా బట్టీలపై దాడులు చేసి 200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మంగళవారం మాట్లాడుతూ ఆరికతోట పరిసరాల్లో సారా తయారువుతోందన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. సారాతయారీ కోసం సిద్ధం చేసి భూమిలో పాతిపెట్టి ఉంచిన 200 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేశామని చెప్పారు.

వంగ రైతుకు బెంగ..!


రామభద్రపురం కూరగాయల మార్కెట్‌లో కొనుగోలు దారుల కోసం ఎదురు చూస్తున్న వంగ రైతులు

- పడిపోయిన ధర
- కిలో రూ.2 నుంచి రూ.3
- మార్కెట్‌లో గిట్టుబాటు కరువు
- కుదేలవుతున్న రైతాంగం

రామభద్రపురం: వంగ ధర రైతు నడ్డి విరిచింది. ఎంతో ఆశతో వంగ పంటను సాగుచేసిన రైతన్నలు కుదేలయ్యారు. రామభద్రపురం కూరగాయల మార్కెట్‌లో సుమారు 20 కిలోలు ఉన్న క్రేట్ వంగ కాయల ధర రూ.50 నుంచి రూ.60 పలుకుతోంది. అదీ కొనేవాడు లేక రైతన్నలు కొనుగోలు చేయాలని దళారులను బతిమాలుకుంటున్న పరిస్థితి ఉంది. రిటైల్ మార్కెట్‌లో వినియోగదారులకు రూ.15 నుంచి రూ.20 వరకు పలుకుతున్న వంగ ధర అదే రైతులు విక్రయించేసరికి రూ.2 నుంచి రూ.3లకు కూడా కొనేవారు కరువయ్యారు. గతేడాది వంగ సాగుతో లాభాలు కళ్ల చూసిన రైతులు ఈఏడాది జిల్లా వ్యాప్తంగా 150 ఎకరాలలో సాగు చేయగా రామభద్రపురం మండలంలో సుమారు 50 ఎకరాల్లో సాగు చేస్తున్నారు.

కొనుగోలు దారులను బతిమాలుతున్నాం



మాది మెంటాడ మండలం కుంటినవలస. ఎకరా విస్తీర్ణంలో వంగ పంట సాగుచేస్తున్నాను. ఇప్పటి వరకు రూ.40 వేలు పెట్టుబడి పెట్టాను. వారానికి రెండుసార్లు పురుగు మందు పిచికారీ చేయడానికి రూ.4వేల వరకు ఖర్చవుతుంది. కొద్దో గొప్పో వంకాయలు దొరుకుతున్నాయన్న సమయానికి ధర పూర్తిగా కుదేలైంది. ఆరుక్రేట్‌లతో తీసుకొచ్చిన వంకాయలు వ్యాపారులను బతిమాలి ఒక్కో క్రేట్ రూ.50 చొప్పున విక్రయించాను. కిలో ధర రూ.2.50 పడింది. ఇంతగా వంగధర కుదేలవడం ఇదే మొదటి సారి. పరిస్థితి ఇలాగే కొనసాగితే పూర్తిగా నష్టాలపాలవుతాం

– మాదిరెడ్డి లక్ష్మి, వంగ రైతు, కుంటినవలస